క్లుప్తంగా

విద్యుత్ కోతలతో అవస్థలు


గంట్యాడ విద్యుత్ సబ్ స్టేషన్

గంట్యాడ: అప్రకటిత విద్యుత్ కోతలతో మండల ప్రజలు అవస్థలు పడుతున్నారు. గంటల తరబడి విద్యుత్ కోతలు విధిస్తున్నట్టు ప్రజలు ఆరోపిస్తున్నారు.ఎండల తీవ్రత కారణంగా ఉక్కపోత భరించలేక ఫ్యాను కింద సేదతీరు దామనుకునే ప్రజలకు విద్యుత్ కోతల వల్ల ఇబ్బందులు తప్పడం లేదు. రాత్రి పూట విద్యుత్ సరఫరాను నిలిపివేస్తుండడంతో కంటి మీద కునుకు లేకుండా ప్రధానంగా వృద్ధులు, పిల్లలు అల్లాడిపోతున్నారు. నిద్రిస్తున్న సమయంలోనే విద్యుత్ తీసేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.ఇన్వర్టర్లు ఉన్న వారికి పర్వా లేదు కానీ అవి లేని వారికి ఇబ్బందులు తప్పడం లేదు. ఎండలు, ఉక్కపోత తీవ్రంగా ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో తరచూ విద్యుత్ కోతలు విధించడం సరికాదని ప్రజలు మండి పడుతున్నారు. మండలంలో విద్యుత్ కోతల విషయాన్ని మండల విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాస్ వద్ద సాక్షి ప్రస్తావించగా,విద్యుత్ కోతలు అంటూ ఏమి లేవని, రాత్రి వేళ ఎందుకు విద్యుత్ నిలిపివేస్తున్నారో సిబ్బందిని ఆరా తీస్తామని చెప్పారు.

వేసవి శిక్షణ శిబిరాల ప్రారంభం నేడే

గుర్ల: స్థానిక శాఖా గ్రంథాలయంలో ఈనెల 28న వేసవి శిక్షణ శిబిరాలు ప్రారంభం కానున్నాయని ఆ గ్రంథాలయ అధికారి పి.రామారావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. శిక్షణ శిబిరం జూన్ 6 వరకు కొనసాగుతుందని పేర్కొ న్నారు.శిబిరంలో విద్యార్థులకు చిత్రలేఖనం, పుస్తకపఠనం, కథలు చెప్పడం, రాయడం తదితర అంశా ల్లో శిక్షణ ఇస్తామని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

యథేచ్ఛగా మట్టి అక్రమ తవ్వకాలు


దబ్బిరాజుపేటలోని నాయుడు చెరువులో మట్టి తవ్వకాలు

వేపాడ: మండలంలోని చెరువుల్లో మట్టి అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి. రియల్ ఎస్టేట్‌ల లేఅవుట్‌లు,ఇతర అవసరాలకు ఎలాంటి అనుమతులు లేకుండా చెరువుల్లో మట్టిని తవ్వేస్తున్నారు. సోంపురం గ్రామంలోని పెద్దచెరువు, అరిగిపాలెం గ్రామంలోని ఊరచెరువు, దబ్బిరాజుపేటలో నాయుడు చెరువుల్లో అక్రమ మట్టి తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. జేసీబీతో తవ్వి ట్రాక్టర్లతో తరలించుకుపో తున్నారని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. మట్టి తవ్వకాల విషయాన్ని ఇరిగేషన్ ఏఈ హనుమంతురావు వద్ద సాక్షి ప్రస్తావించగా...చెరువుల్లో మట్టి తవ్వకాలకు ఎవరికీ, ఎలాంటి అనుమతులు ఇవ్వలేదన్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి, చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రైల్వేస్టేషన్‌లో సోదాలు

విజయనగరం క్రైమ్: పహల్గాం ఉగ్రదాడి జరిగిన అనంతరం దేశ వ్యాప్తంగా పోలీసులు అలర్టయ్యారు. ఇందులో భాగంగా విశాఖ రైల్వే జోన్ పరిధిలో జీఆర్‌పీ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ ఆదేశాలతో ఆదివారం స్థానిక రైల్వేస్టేషన్‌లో జీఆర్‌పీ సిబ్బంది తనిఖీలు చేపట్టారు. జీఆర్‌పీ ఎస్సై బాలాజీ నేతృత్వంలో సిబ్బంది క్షుణ్ణంగా తనిఖీలు చేశారు.

మానవాళిని సన్మార్గంలో నడపడమే లక్ష్యం


డాక్టర్ ఎం. ఆముక్త మాల్యదను సత్కరిస్తున్న విజయభావన సాహితీ సమాఖ్య ప్రతినిధులు

విజయనగరం టౌన్: మానవాళిని సన్మార్గంలో నడపడమే లక్ష్యంగా పురందరదాసు, క్షేత్రయ్య, రామదాసు, త్యాగయ్య శ్యామశాస్త్రి, ముత్తుస్వామి దీక్షితులు వంటి వాగ్గేయకారులు తమ జీవితాలను అంకితం చేశారని మధుర గాయని డాక్టర్ ఎం. ఆముక్త మాల్యద అన్నారు. ఆదివారం సాయంత్రం స్థానిక గురజాడ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించిన విజయభావన సాహితీ సదస్సులో వాగ్గేయకారుల సామాజిక దృక్పథం అనే అంశంపై ప్రసంగించారు. నేటి కాలంలోనూ అజ్ఞాత వాగ్గేయకారులు ఎందరో ఉన్నారని చెబుతూ గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్ గురించి, వారి కృతుల విశిష్టతను విశదీకరించారు. అనంతరం ముఖ్య అతిథిని నిర్వాహకులు సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ ఎ. గోపాలరావు, దశగ్రంథాల సుబ్రహ్మణ్యం, బురిడి అనురాధ పరుశురామ్, డాక్టర్ భైరవభట్ల విజయాదిత్య, తదితరులు పాల్గొన్నారు.

బీమాతో ఉపాధి వేతనదారులకు ధీమా

- పీఎం సురక్ష, పీఎం జీవన్‌జ్యోతి బీమా యోజన పథకాల కింద బీమా సదుపాయం
- పీఎం సురక్ష యోజన పథకానికి ఏడాదికి చెల్లించాల్సిన ప్రీమియం రూ.20
- పీఎం జీవన్‌జ్యోతియోజన పథకానికి ఏడాదికి చెల్లించాల్సిన ప్రీమియం రూ.436
- వేతనదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించే బాధ్యతను ఫీల్డ్ అసిస్టెంట్లకు అప్పగించిన అధికారులు
- జిల్లాలో 5.63 లక్షల మందికి వర్తించనున్న బీమా


గొల్లలవలసలో ఉపాధి పనులు చేస్తున్న వేతనదారులు(ఫైల్)

మెరకముడిదాం: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం వేతనదారులకు కేంద్ర ప్రభుత్వం బీమా సదుపాయం కల్పిస్తోంది. ప్రమా దాల్లో వేతనదారులు దురదృష్టవశాత్తు మరణించినా, వైకల్యం సంభవించినా బీమా రక్షణ కల్పించేందుకు ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన పథకాలను అమలు చేస్తోంది. అయితే ఈ పథకాలు ఉన్న సంగతి చాలా మంది వేతనదారులకు తెలియక పోవడంతో వారి కుటుంబాలు నష్టపోతున్నాయి. ఈపథకాల ద్వారా జాబ్‌కార్డు ఉన్న వేతనదారులందరికీ బీమా చేయించాలని తాజాగా పంచాయ తీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖల కమిషనర్‌లను ప్రభు త్వం ఆదేశించింది. వేతనదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించి వాటిని బ్యాంకుల్లో నమోదు చేయించే బాధ్యతను ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్ల కు సంబంధిత శాఖల అధికారులు అప్పగించారు. ఫీల్డ్ అసిస్టెంట్, మేట్ అందజేసే దరఖాస్తుపై వేతనదారులు సంతకం చేసి తిరిగి వారికి అప్పగిస్తే మిగతా ప్రక్రియ అంతా వారే చూసుకుంటారని, వేతనదారుల ఖాతా నుంచి ప్రీమియం మొత్తాన్ని మినహాయించుకుంటారని అధికారులు చెబుతున్నారు. విజయనగరం జిల్లాలో ఉపాధి పనులకు హాజరవుతున్న 5.63 లక్షల మంది వేతనదారులంతా బీమా పథకానికి అర్హులే.

జిల్లాలో ఉపాధి హామీ జాబ్ కార్డులు, వేతనదారుల వివరాలు	
మొత్తం జాబ్‌కార్డులు:	3,85,000
యాక్టివ్‌లో ఉన్నవి:	3,43,000
వేతనదారుల సంఖ్య:	6,86,000
యాక్టివ్‌లో ఉన్న వారి సంఖ్య :	5,63,000
ప్రస్తుతం పనులకు హాజరవుతున్న వేతనదారులు:	2,10,000

రెండు రకాలుగా బీమా సదుపాయం

ఉపాధి వేతనదారులకు కేంద్ర ప్రభుత్వం పీఎం సురక్ష, పీఎం జీవన్ జ్యోతి యోజన పథకాల కింద రెండు రకాల బీమా సదుపాయం కల్పిస్తోంది. పీఎం సురక్ష బీమా యోజన పథకం కింద 18 నుంచి 70 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న వేతనదారులు ప్రతీ సంవత్సరం రూ.20 ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. ఈ పథకంలో ప్రీమియం చేయించుకున్న వారు ప్రమాదవశాత్తు మరణించినా లేదా పూర్తి వైకల్యం కలిగినా రూ.2 లక్షల పరిహారం అందుతుంది.పాక్షికంగా వైకల్యం సంభవిస్తే లక్ష రూపాయల సహాయం అందుతుంది. పీఎం జీవన జ్యోతి యోజన పథకం కింద బీమా పొందేందుకు 18 నుంచి 50 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న వారు ఏడాదికి రూ.436 ప్రీమియం చెల్లించాలి. ఈ పథకం కింద ప్రీమియం చేయించుకున్న వారు ప్రమాదవశాత్తు మరణించినా, లేదా సహజమరణం పొందినా రూ. 2 లక్షల పరిహారం అందుతుంది. జాబ్‌కార్డు ఉన్న వేతనదారులంతా తమ ఫీల్డ్ అసిస్టెంట్, మేట్లను సంప్రదించి త్వరగా ప్రీమియం చెల్లించాల్సిందిగా అధికారులు కోరుతున్నారు. ఈ పథకాలపై వేతనదారులకు ఉపాధి హామీ సిబ్బంది అవగాహన కల్పిస్తున్నారు.

బీమా చేయించుకోవాలి

జాబ్ కార్డు ఉన్న ఉపాధి వేతదారులు అంతా పీఎం సురక్ష, పీఎం జీవన్ జ్యోతి యోజన పథకాల్లో ఏదో ఒక పథకం కింద బీమా చేయించుకోవాలి. ఉపాధి సిబ్బంది ఇచ్చే దరఖాస్తులపై వేతనదారులు సంతకాలు చేసి ఇస్తే వేతనదారులకు ఖాతా ఉన్న బ్యాంకులో వాటిని సమర్పిస్తాం. వేతనదారుల ఖాతా నుంచి ప్రీమియం మినహాయించుకుంటారు. బీమా కోసం ఎవరికి నేరుగా నగదు చెల్లించాల్సిన అవసరం ఉండదు.

– రమామణి, ఉపాధి హామీ పథకం ఇన్‌చార్జ్ ఏపీడీ, రాజాం క్లస్టర్

ఉగ్రదాడిలో మృతులకు నివాళి


శృంగవరపుకోట: కొవ్వొత్తుల ర్యాలీ చేస్తున్న ఆర్యవైశ్యులు

బొండపల్లి: జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాం ప్రాంతంలో ఉగ్రవాదులు జరిపిన దాడుల్లో మృతి చెందిన పర్యాటకులకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ ఉద్యోగులు ఆదివారం సాయంత్రం నివాళి అర్పించారు. తహసీల్దార్ డోల రాజేశ్వరరావు, రెవెన్యూ ఉద్యోగులతో కలిసి ఉగ్రవాదుల దాడిని ఖండించారు. కొవ్వొత్తులు వెలిగించి మృతులకు నివాళి అర్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఉగ్రవాదులు పర్యాటకులపై విచక్షణారహితంగా కాల్పులు జరిపి వారిని హతమార్చడం అమానుషమని అన్నారు. ఇటువంటి చర్యలు పునరావృత్తం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఏంతైనా ఉందన్నారు. డిపూట్యీ తహసీల్దార్ ఆర్.రాజేశ్వరరావు, ఆర్ఐ హరికృష్ణ, పలుగ్రామాల వీఆర్‌ఓలు ఉన్నారు.

ఎస్.కోటలో..

శృంగవరపుకోట: పహల్గాంలో ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన వారికి స్థానిక మోక్షవిద్య యోగమందిర్ సాధకులు ఆదివారం ఉదయం నివాళి అర్పించారు. యోగమందిర్‌లో సాధకులు తమ సాధనలో ముందుగా పహల్గామ్ మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థన చేశారు. ఈసందర్భంగా సంస్థ కార్యదర్శి శీలా కోటేశ్వరరావు మాట్లాడుతూ ఈఘటనను దేశవ్యాప్తంగా ఉన్న ప్రతి ఒక్కరూ ఖండించాల్సిన అవసరం ఉందన్నారు. పేట్రేగిపోతున్న మతోన్మాదం, ఉగ్రవాదాలకు పహల్గాం ఘటన నిదర్శనమన్నారు. ఉగ్రవాదాన్ని కూకటి వేళ్లతో కూల్చేయడానికి భారత జాతి యావత్తూ ఒక్కతాటిపై నడవాల్సిన సందర్భం ఇది అని అన్నారు. ఇది భారతీయ ఆత్మపై జరిగిన దాడి అన్న ప్రధాని మోదీ మాటల్లో నిజం ఉందన్నారు. యోగా సాధకులైన ఉద్యోగులు , విశ్రాంత ఉద్యోగులు, యువకులు పాల్గొన్నారు.

కొవ్వొత్తుల ర్యాలీ

శృంగవరపుకోట: పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ ఆదివారం రాత్రి ఎస్.కోట పట్టణంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వ ర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు.ఉగ్రవాదుల కాల్పుల్లో మరణించిన వారి ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు. ఉగ్రవాదులపై కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ఆర్యవైశ్య సంఘ నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలో దేవి జంక్షన్ నుంచి ఆర్టీసీ డిపో వరకు సాగిన ర్యాలీలో పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు నానాజీ, వాసవి యువజన సంఘం సభ్యులు బాలనాగు శ్రీనివాస్, వాసవి క్లబ్ అధ్యక్షుడు ఉప్పల విజయ్‌కుమార్, పూర్వ అధ్యక్షుడు వేమూరి శ్రీనివాసరావు, రీజనల్ సెక్రటరీ ఆదిమూలం హరీష్ కుమార్, ఆర్యవైశ్య సంఘ ప్రముఖులు కొల్ల వెంకటేష్, తోట సేనయ్య, కోదేటి వెంకట సత్యనారాయణ మూర్తి,పచ్చికోళ్ల అప్పారావు పాల్గొన్నారు.



బొండపల్లి: తహసీల్దార్ కార్యాలయం వద్ద నివాళులర్పిస్తున్న రెవెన్యూ ఉద్యోగులు

పవర్ ప్లాంట్ ఏర్పాటు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి


పాత మారికలో ఆందోళన చేస్తున్న గిరిజనులు

వేపాడ: కరకవలస పంచాయతీలోని గిరిశిఖర మారిక గ్రామంలో హైడ్రో పవర్ ప్రాజెక్టు ఏర్పాటు నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్, ఆగ్రామ గిరిజనులు డిమాండ్ చేశారు. పవర్ ప్లాంట్ కోసం అదానీ గ్రూపునకు తమ గ్రామాన్ని, భూములు అప్పగించవద్దంటూ మారిక గ్రామ గిరిజనులు ఆదివారం ఆందోళన చేశారు. అలాగే పాతమారికలో 105 గిరిజన కుటుంబాలతో నిర్వహించిన సదస్సులో చల్లా జగన్ మాట్లాడుతూ అదానీ కంపెనీకి గిరిజనుల భూములను అప్పగించాలనుకోవడం సరికాదని అన్నారు. మారిక రెవెన్యూలో 35 సర్వే నంబర్లు ఉంటే 1 నుంచి 32 సర్వే నంబర్లలోని భూములను, ఇళ్లు, బడి,గుడి, కొండలు అన్నీ అదానీ గ్రూపునకు కట్టబెడతామనడం అన్యాయమన్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ సోమవారం తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించనున్నామని చెప్పారు. అవసరమైతే జిల్లాలో ఉన్న గిరిజనులందరినీ ఏకం చేసి పోరాటం చేస్తామని హెచ్చరించారు. సర్పంచ్ పాత బోయిన పెంటమ్మ, గిరిజన నాయకులు జలారీ వీర్రాజు, పాలి సోమేష్‌కుమార్, గెమ్మెల బాబురావు, కిల్లో ఆనంద్, రామక్రిష్ణ, అప్పల నాయుడు, బొబ్బిలి గణేష్, వెంకటరావు, శ్రీను, ఆశు కృష్ణ అర్జున్, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి నిరాహార దీక్షలు

శృంగవరపుకోట: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈనెల 28, 29 తేదీల్లో రెండు రోజుల పాటు ఆర్టీసీ డిపోల్లో నిరాహార దీక్షలు చేయనున్నట్లు స్థానిక ఆర్టీసీ డిపో నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ కార్యదర్శి ఓ.రాజయ్య ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉద్యోగుల భద్రత, అక్రమ సస్పెన్షన్ల రద్దు, ప్రమోషన్స్ పునరుద్ధరణ, పాత వైద్య విధానం పునరుద్ధరణ, గ్యారేజీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం, సిక్ లీవ్‌లకు చెల్లింపులు, ఎలక్ట్రికల్ బస్సుల కొనుగోళ్లు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాల చెల్లింపు వంటి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. దీక్షలను జయప్రదం చేయాలని కార్మికులు, ఉద్యోగులకు పిలుపు నిచ్చారు. నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ చేస్తున్న పోరాటానికి కార్మిక సంఘాలు మద్దతు ఇవ్వాలని కోరారు.

బదిలీ అయిన న్యాయమూర్తికి సన్మానం


న్యాయమూర్తి వాణిని సత్కరిస్తున్న న్యాయవాదులు

శృంగవరపుకోట: స్థానిక మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తిగా సేవలందించి శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటకు బదిలీపై వెళ్తున్న సబ్బవరపు వాణిని ఎస్.కోట బార్ అసోసియేషన్ సభ్యులు ఆదివారం ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. బార్ అధ్యక్ష, కార్యదర్శులు జి.సూరిదేముడు, బి.వి.ఎస్.రామారావు నేతృత్వంలో నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో న్యాయమూర్తి వాణి మాట్లాడుతూ ఎంతోమంది సీనియర్ లాయర్లు ఉన్న ఎస్.కోటలో పనిచేయడం సంతృప్తిని, ఎన్నో అనుభవాలను మిగిల్చిందన్నారు. లాయర్ల సహకారంతో సివిల్, క్రిమినల్ కేసుల పరిష్కారంలో జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచామన్నారు. బార్ అధ్యక్షుడు సూరిదేముడు మాట్లాడుతూ కోర్టును అద్దెభవనంలోకి తరలించడంలో, జూనియర్స్‌కి వాదనలు, ప్లీడింగ్స్ నేర్పే విషయంలో న్యాయమూర్తి సహకారం మరువలేనిదని చెప్పారు. సీనియర్ న్యాయవాదులు అల్లు సత్యాజీ, గేదెల ప్రకాశ్, టి.టి.వి.రమణాజీ, ఎస్.టి.వి.దాసు, వారాది ఈశ్వరరావు, డబ్ల్యూ.ఎస్.శర్మ, కె.వి.ఎస్.రామరాజు, ఎం.చంద్రశేఖర్, బి.త్రిమూర్తులు, బి.రామకృష్ణ, బి.సత్యనారాయణ, ఆర్.సత్యనారాయణ, సీహెచ్.ఆర్.ఎ.నాయుడు, బి.వెంకటరావు, బి.రామకృష్ణ, టి.వి.ఆర్.మూర్తి, జి.చిట్టిబాబు, బి.శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆధిపత్యం కోసం ఆరాటం..!

- అంతర్యుద్ధంలో కూటమి నేతలు బిజీబిజీ
- నియోజకవర్గ సమస్యలు గాలికి వదిలేసిన వైనం
- ఉపాధి లేదు, ఉద్యోగాల ఊసే లేదు
- కోపంతో రగిలిపోతున్న యువత
- సంక్షేమ పథకాలు అందక సామాన్యుడి ఆవేదన
- నేతల వైఖరితో హడలెత్తిపోతున్న అధికారులు


నెల్లిమర్ల - రణస్థలం ప్రధాన రహదారిలో రామతీర్థం వద్ద మురుగు నీరు


రామతీర్థం ఆలయం సమీపంలో రాళ్లు తేలిన రహదారి

నెల్లిమర్ల రూరల్: ఒక పార్టీ అయితే బాగుణ్ణు.. ప్రయాణం సాఫీగా సాగేది.. అనుకున్న పనులు ఎంచక్కా జరిగేవి.. తమకి చెందిన వారికి ఏ పని కావాలన్నా క్షణాల్లో చేసి పెట్టేసేవాళ్లం.. మూడు పార్టీలు.. మండలానికి ముప్పై మంది నాయకులు.. అనుకున్న పనులు అవ్వడం లేదు.. పార్టీ అధికారంలో ఉన్నా ఏ పనీ చేసుకోలేని దుస్థితి.. ఒక వేళ చేసే పరిస్థితి ఉన్నా.. సుప్రీం నుంచి పూర్తి స్థాయిలో ఫోకస్..ఆమె ఆదేశాలతోనే అధికారులు కూడా అడుగులు వేయాల్సి ఉంది.. అధికారులు కూడా తమ పనులకు అడుగడుగునా అడ్డుపడుతున్నారనేది టీడీపీ నేతల వెర్షన్. ఫలితంగా తాము అనుకున్నట్లు ఏదీ జరగకపోవడంతో టీడీపీ శ్రేణులు ఎమ్మెల్యే లోకం నాగమాధవిపై కోపంతో రగిలిపోతున్నారనేది బహిరంగ సత్యం. దీంతో నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో టీడీపీ, జనసేన అగ్ర నేతలు ఆధిపత్యం కోసం నిత్యం పాకులాడుతూ జనం సమస్యలను గాలి కొదిలేస్తున్నారనే విమర్శలు సామాన్య ప్రజల నుంచి వినిపిస్తున్నాయి.

నియోజకవర్గ సమస్యలు గాలికి:

ఆధిపత్యం కోసం ఆరాటపడుతున్న కూటమి నేతలు నియోజకవర్గ సమస్యలు గాలికి వదిలేసారని సామాన్య ప్రజలు ఆరోపిస్తున్నారు. తాను ఎమ్మెల్యేగా గెలిస్తే వంద రోజుల్లోనే పరిశ్రమలను స్థాపించి సుమారు ఐదు వేల మంది యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తానని చెప్పిన ఎమ్మెల్యే లోకం నాగమాధవి ప్రస్తుతం ఆ ఊసే ఎత్తకపోవడంతో నిరుద్యోగ యువత కోపంతో ఊగిపోతున్నారు. అధికారంలోకి వచ్చి దాదాపు ఏడాది కావస్తున్నా పరిశ్రమలు, ఉద్యోగాలు ఏవంటూ యువత ప్రశ్నిస్తున్నారు. అభివృద్ధి లేదు..సంక్షేమ పథకాల ఊసే లేదు. గత ప్రభుత్వం చేసిన సంక్షేమాన్నే ప్రజలు గుర్తు చేసుకునే పరిస్థితి ప్రస్తుతం గ్రామాల్లో దాపురించింది. గెలిపించి తప్పు చేశామంటూ ఓట్లు వేసిన ప్రజలే విమర్శిస్తున్నారు. మరోవైపు గ్రామాల్లో డ్రైనేజీ వ్యవస్థ పెను సమస్యగా మారింది. గతంలో క్రమం తప్పకుండా పారిశుధ్య పనులు జరిగేవి. పంచాయతీల్లో నిధుల లేమితో ఎక్కడా పారిశుధ్య పనులు జరగడం లేదు. దీంతో గ్రామాల్లో మురుగు నీరు రోడ్లపైకి ప్రవహిస్తోంది. ఈగలు, దోమలు వృద్ధి చెరంది రోగాల బారిన పడుతున్నామని జనం గగ్గోలు పెడుతున్నారు. నెల్లిమర్ల - సతివాడ ప్రధాన రహదారి విస్తరణ పనులు మధ్యలోనే ఆగిపోయాయి. దీంతో ప్రయాణికులు నరకయాతన అనుభవిస్తున్నారు. తమకి రావాల్సిన బెనిఫిట్స్ కోసం తారకరామతీర్థ సాగర్ నిర్వాసితులు ఎదురుచూపులు చూస్తున్నారు. ఇళ్ల పట్టాల కోసం ఒక్క నెల్లిమర్ల పట్టణంలోనే సుమారు 1300 నిరుపేద కుటుంబాలు నిరీక్షిస్తున్నాయి. కొత్త రేషన్ కార్డుల మంజూరు లేదు. సంక్షేమ పథకాల ఊసేలేదు. మత్స్యకార గ్రామాల ప్రజలు తాగునీటి సమస్యతో అల్లాడుతున్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చాలంటూ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

మూడు పార్టీలు..

ప్రస్తుతం నియోజకవర్గంలో ఆధిపత్యం కోసం మూడు పార్టీలు తహతహలాడుతున్నాయి. కేవలం జనసేన నాయకులు చెబుతున్న పనులే అధికారులు చేస్తుండడంతో తమ పనులు కూడా చేయాలని టీడీపీ నేతలు అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. తాము కూడా తక్కువ కాదన్నట్లు బీజేపీ నాయకులు మరో అడుగు ముందుకేసి ప్రభుత్వ కార్యాలయాల బాట పట్టారు. ప్రధాని నరేంద్ర మోదీ ఫోటోలను కార్యాలయాల్లో పెట్టాలంటూ ఇటీవల అధికారులకు హుకుం జారీ చేశారు. మూడు పార్టీల నుంచి ఒత్తిడిని భరించలేకపోతున్నామని అధికారులు, సిబ్బంది తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ పరిస్థితి గతంలో ఎన్నడూ లేని విధంగా తయారైందని, ఒత్తిడికి గురై అనారోగ్యం బారిన పడుతున్నామంటూ బహిరంగంగానే వాపోతున్నారు. ఆధిపత్యం కోసం ఎవరి ఎజెండా వారిదే అన్నట్లు కూటమి నాయకులు ప్రవర్తిస్తున్నారు. సభలు, సమావేశాలు ఎవరికివారు పెట్టుకుంటూ గందరగోళాన్ని సృష్టిస్తున్నారు. పార్టీ చెప్పిన కార్యక్రమాలు మినహా.. ప్రభుత్వ కార్యక్రమాలకు ఎక్కడా టీడీపీ నాయకులు హాజరు కావడం లేదు. ఎమ్మెల్యే సమావేశాలను ప్రతి గ్రామంలో టీడీపీ నేతలు బాయ్‌కాట్ చేస్తున్నారు.


కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే మాధవి, టీడీపీ ఇన్‌చార్జి బంగార్రాజు మధ్య మాటల యుద్ధం(ఫైల్)

ఎమ్మెల్యే తీరుపై రగిలిపోతున్న టీడీపీ శ్రేణులు..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కేవలం రెండు నెలల్లోనే టీడీపీ – జనసేన మధ్య కుమ్ములాటలు ప్రారంభమయ్యాయి. జనసేన పార్టీ నుంచి బీ పారం దక్కించుకుని ఎమ్మెల్యేగా ఘన విజయం సాధించిన లోకం నాగమాధవి.. గెలిచిన తర్వాత తమను పూర్తిగా పక్కన పెట్టారని టీడీపీ నేతలు వాపోతున్నారు. గెలిచిన వెంటనే ఎమ్మెల్యే కార్యాలయం నుంచి కొంత మంది జనసేన సభ్యుల పేరిట ప్రతి మండలంలో ఉన్న అధికారులకు జాబితాలు పంపించారు. ఆ జాబితాలో ఉన్న వారికే ప్రాధాన్యత ఇవ్వాలని.. ఏ పనులైనా, సమావేశాలైనా వాళ్లనే ఆహ్వానించాలని ఆదేశాలు జారీ చేశారు. అయితే జాబితా కాస్తా బయటకు రావడంతో అప్పట్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశంలో కూడా ప్రొటోకాల్ విషయంలో ఎమ్మెల్యే, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మధ్య మాటల తూటాలు పేలాయి. దీంతో ఏకంగా నియోజకవర్గ స్థాయిలో ఎమ్మెల్యే మాధవికు వ్యతిరేకంగా భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. నియోజకవర్గంలో తమ దుస్థితిపై ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు సహా పలువురు సీనియర్ నేతలు ఆ సమావేశంలో తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ ఓట్లతో గెలిచి..మమ్మల్ని పక్కన పెడతారా..? మేమే లేకపోతే.. ఎమ్మెల్యే అవుతావా? తాడోపేడో తేల్చుకుందాం అంటూ అప్పట్లో హెచ్చరికలు కూడా జారీ చేశారు. ఇది కాస్తా అధిష్టానం దృష్టికి చేరడంతో ఆ పార్టీ పెద్దలు మంగళగిరి పిలిచి మరీ సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ ఎమ్మెల్యే తీరులో మార్పు రాలేదంటూ టీడీపీ నేతలు బహిరంగంగానే తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు నెలల కిందట పెద్ద బూరాడపేట రేషన్ డీలర్ పోస్ట్ విషయంలో కూటమి నేతలు మరో అడుగు ముందుకేసి ఏకంగా రక్తాలు వచ్చేనట్లు కొట్టుకున్నారు. టీడీపీకి చెందిన డీలర్‌ను విధుల నుంచి తప్పించి జనసేన పార్టీ వ్యక్తికి కేటాయించారు. ఈ నేపథ్యంలో గ్రామంలో పర్యటన నిమిత్తం వెళ్లిన జనసేన నాయకులను ప్రశ్నించగా మాటా మాటా పెరిగి ఇరువర్గాలు కర్రలతో కొట్లాడుకున్నారు. బయటకి వెళితే పరువు పోతుందని.. పోలీస్‌స్టేషన్‌లో పంచాయతీ పెట్టి ఇరువర్గాలకు రాజీ కుదిర్చారు. గ్రామాల్లో అభివృద్ధి పనులను కేవలం జనసేన వాళ్లకే అప్పగించడంతో మరింత కోపంతో టీడీపీ శ్రేణులు రగిలిపోయారు. చేసేదేమీ లేక కాలమే సమాధానం చెబుతుందంటూ కాకమ్మ కబుర్లు చెబుతూ టీడీపీ నేతలు కాలాన్ని గడిపేస్తున్నారు.


డబ్బుల్లేవంటున్నారు..



తారకరామతీర్థ సాగర్ ప్రాజెక్ట్ ముంపు గ్రామ నిర్వాసితుల సమస్యలను ఆరు నెలల్లో పరిష్కరిస్తానని ఎన్నికల ప్రచారంలో ప్రస్తుత ఎమ్మెల్యే లోకం మాధవి స్పష్టమైన హామీ ఇచ్చారు. దీనిపై గ్రామస్తులతో కలిసి ఎమ్మెల్యే కార్యాలయానికి కూడా వెళ్లాం. కలెక్టరేట్‌లో సమీక్షకు ఎమ్మెల్యే వెళ్లిపోగా..ఆమె భర్త లోకం ప్రసాద్‌తో మాట్లాడాం. ఆ రోజు హామీ ఇచ్చాం కాని ప్రస్తుతం ప్రభుత్వం వద్ద డబ్బులు లేవు.. ఏమి చేస్తాం అని మాట్లాడారు.

–జమ్ము రమణ, ఉప సర్పంచ్, ఏటీ అగ్రహారం

సమస్యలపై దృష్టి సారించాలి..



ఆధిపత్యం కోసం ఆరాటమే తప్ప ప్రజా సమస్యల పరిష్కారంలో కూటమి నాయకులు చొరవ చూపడం లేదు. పట్టణంతో పాటు గ్రామాల్లో సమస్యలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఉపాధి హామీ వేతనదారులకు సకాలంలో వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నారు. తారకరామతీర్థ సాగర్ ప్రాజెక్ట్ నిర్వాసితులు న్యాయం కోసం ఎదురు చూపులు చూస్తున్నారు. ఎన్నికల్లో గెలుపుకోసం ఎన్నో హామీలు ఇచ్చారు. సంక్షేమ పథకాలు అందకపోవడంతో సామాన్య ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. హామీలు అమలు చేయకపోతే ప్రజలే బుద్ధి చెబుతారు.

– కిల్లంపల్లి రామారావు, సీపీఎం నాయకుడు, నెల్లిమర్ల